సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 17 । జనవరి । 2024



అయోధ్యకు రైలు సౌకర్యం
అయోధ్య రామయ్య దర్శనానికి వెళ్లే జిల్లా వాసులకు ఇండియన్ రైల్వే ప్రత్యేక రైలును అందుబాటులోకి తెచ్చింది. 8లో



వేగంగా ఎన్‌హెచ్ 342 పనులు
జిల్లాలో 342 జాతీయ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. ఇది పూర్తయితే పుట్టపర్తి నుంచి బెంగళూరుకు గంటలోనే చేరుకోవచ్చు. 8లో

గరిష్టం/కనిష్టం
33.8°/ 18.4°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన డీజీపీ



డీజీపీ రాజేంద్రనాథరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ మాధవరెడ్డి

గోరంట్ల: ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లను డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. పాలసముద్రం సమీపంలోని 'నాసిన్' క్యాంపస్ ప్రారంభోత్సవానికి మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేయగా, భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా స్వయంగా డీజీపీ పర్యవేక్షించారు. సోమవారం రాత్రే నాసిన్ సంస్థ వద్దకు చేరుకున్న డీజీపీ, భద్రత ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అంతకుముందు డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి ఎస్పీ మాధవరెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

గుంతకల్లు డీఆర్‌ఎంగా వినిత్ సింగ్



వినిత్ సింగ్ (ఫైల్)

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్‌ఎం)గా వినిత్ సింగ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసినట్లు డివిజనల్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం డీఆర్‌ఎంగా ఉన్న మనీష్ అగర్వాల్‌ను సెంట్రల్ రైల్వేలోని నాగపూర్ డీఆర్‌ఎంగా బదిలీ చేయగా, ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని సంబల్‌పూర్ డీఆర్‌ఎంగా ఉన్న వినిత్‌సింగ్‌ను గుంతకల్లుకు బదిలీ చేసినట్లు వివరించాయి.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం



జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: ఉభయ జిల్లాల జెడ్పీ సర్వసభ్య సమావేశం ఎట్టకేలకు బుధవారం నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రారంభం కానుంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ,చరణ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు హాజరు కానున్నారు. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలు, తీసుకున్న చర్యలకు సంబంధించి సమగ్ర వివరాలతో అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని జెడ్పీ అధికారులు సమాచారమిచ్చారు.

ఆసక్తికరంగా కొత్త సీఈఓ చేరిక
జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి సస్పెన్షన్ అయ్యాక.. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తాజాగా రెగ్యులర్ సీఈఓగా శిక్షణ పూర్తి చేసుకున్న ఐఏఎస్ వైఖోమ్ నిదియాదేవిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆమె అనంతపురానికి చేరుకొని ఇక్కడి ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఉంటున్నారు. కలెక్టర్ గౌతమిని కలిశారు. అయితే బాధ్యతలు మాత్రం చేపట్టలేదు. ఈ విషయం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఆమె బుధవారమైనా బాధ్యతలు తీసుకుంటారో లేదో అనే అంశం అందరిలో ఆసక్తికరంగా మారింది.

20న 'నవోదయ' పరీక్ష

- ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8,857 మంది హాజరు
- 34 కేంద్రాల ఏర్పాటు
- వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశానికి (2024–25 విద్యా సంవత్సరానికి) ఈనెల 20వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. లేపాక్షి జవహర్ నవోదయ పాఠశాలలో మొత్తం 80 సీట్లు ఉండగా, ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8,857 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 34 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబర్, పాస్‌వర్డ్, పుట్టిన తేదీ వివరాలు ఉపయోగించి అడ్మిట్ కార్డులు వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. 18వ తేదీ అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో సెంటర్ సూపరింటెండెంట్లకు (సీఎస్), సెంటర్ లెవెల్ అబ్జర్వర్లు (సీఎల్ఓ)లకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9573287480, 9493832164, 8412054394, 9485235387 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

నాసిన్ తలమానికం

- ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది
- ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ
- హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర ప్రముఖులు



లేపాక్షి ఆలయంలో తోలుబొమ్మల ప్రదర్శన తిలకిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



నాసిన్ వేదికపై ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, చిత్రంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్



లేపాక్షి ఆలయం వద్ద ప్రజలకు ప్రధాని అభివాదం

సాక్షి, పుట్టపర్తి : గోరంట్ల మండలం పాల సముద్రం వద్ద ఏర్పాటైన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మంగళవారం ఆయన నాసిన్ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ జిల్లా ఖ్యాతిని కొనియాడారు. 'పుట్టపర్తి సత్యసాయిబాబా, స్వాతంత్ర్య సమరయోధుడు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు, ప్రఖ్యాత తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావు ఈ ప్రాంతవాసులు కావడం గర్వకారణం. విజయనగర సామ్రాజ్య సుపరిపాలనకు మూలాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి' అంటూ కీర్తించారు. ఇక్కడ నాసిన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక నాసిన్ ఏర్పాటుకు తోడ్పాటునందించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సందీప్ మల్హోత్ర, సీబీఎస్ఈ చైర్మన్ సందీప్ కుమార్ వర్మ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, నాసిన్ అధికారులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం
నాసిన్ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీకి పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం మధ్యాహ్నం 12.50 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్న ప్రధాని మోదీకి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు గోరంట్ల మాధవ్, రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఎక్సైజ్, రెవెన్యూ) డాక్టర్ రజత్ భార్గవ్, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, అడిషనల్ డీజీ శంకరబ్రత బాగ్చీ, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, ఆర్డీఓ భాగ్యరేఖ, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, పార్థసారథి, గుడిసె దేవానంద్, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్‌జే రత్నాకర్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మధ్యాహ్నం 1:03 గంటలకు మోదీ ప్రత్యేక హెలికాప్టర్‌లో లేపాక్షికి వెళ్లారు. అక్కడి నుంచి నాసిన్‌కు వెళ్లి సాయంత్రం 6 గంటలకు తిరిగి పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

లేపాక్షి శిల్పకళలు అద్భుతం
మధ్యాహ్నం 1.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా లేపాక్షిలోని హెలిప్యాడ్‌కు చేరుకున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ.. పాపనాశేశ్వర, వీరభద్ర స్వామి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మోదీ లేపాక్షి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ విశిష్టత గురించి గైడ్లు ప్రధానికి వివరించారు. శిల్ప కళా సంపదను చూసి ప్రధాని మైమరచిపోయారు.



రూపుదిద్దుకున్న నాసిన్ అకాడమీ భవనం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యే శంకరనారాయణ, సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు



ఐఆర్ఎస్ ట్రెయినీ ఆఫీసర్ల బృందంతో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు



ప్రధాని మోదీ, గవర్నర్ నజీర్, సీఎం జగన్‌కు నాసిన్‌లో సౌకర్యాల గురించి వివరిస్తున్న అధికారి

19న రైతు విజయ సంకల్ప యాత్ర



వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్ర పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఈనెల 19న మండలంలోని ఎన్. ఎనుమలవారిపల్లి సమీపంలోని నల్లగొండ రిజర్వాయర్ నుంచి 'డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్ర'ను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తన స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు.

పుట్టపర్తిని కోనసీమగా మారుస్తాం
ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ కృష్ణా జలాలతో నింపి మరో కోనసీమగా మారుస్తామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 193 చెరువులను కృష్ణా జలాలతో నింపేందుకు అనుమతులు మంజూరు చేయడంతో పాటు రూ.846 కోట్ల నిధులు మంజూరు చేసిన సీఎంకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడంతో పాటు ఆరు మండలాల ప్రజల తాగునీటి ఇబ్బందులను తీర్చడమే తన లక్ష్యమన్నారు. దక్షిణ భారతదేశంలోనే అతి తక్కువ వర్షపాతం కలిగి పుట్టపర్తి నియోజకవర్గంలో స్థానికంగా ఉపాధి లేక గత టీడీపీ ప్రభుత్వంలో రైతులు, రైతు కూలీలు పెద్ద సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి దినసరి కూలీలుగా దుర్భర జీవితాలు గడిపారన్నారు. చెరువులను నీటితో నింపడం ద్వారా వలసలు పూర్తిగా నివారిస్తామన్నారు.

పాదయాత్ర షెడ్యూల్ ఇలా..
ఈనెల 19న (శుక్రవారం) నల్లమాడ మండలం నల్లగొండ ఎనుమలవారిపల్లి సమీపంలోని నల్లగొండ రిజర్వాయర్ వద్ద ఉదయం 7 గంటలకు భూమి పూజ చేసి డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్పయాత్రను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి చంద్రాయునిపల్లి, పాతబత్తలపల్లి, కే. బత్తలపల్లి, తోలేటివారిపల్లి, పుల్లగూరపల్లి, కమ్మవారిపల్లి, మీదుగా నల్లసింగయ్యగారిపల్లికి చేరుకొని అక్కడి రైతులతో మాట్లాడతారు. నల్లమాడ క్రాస్‌కు చేరుకొని మధ్యాహ్నం భోజనం చేస్తారు. అనంతరం ఎద్దులవాండ్లపల్లి తండా వద్ద గిరిజనులతో ముఖాముఖి అవుతారు. మూలప్పగారిపల్లి, మసకవంకపల్లి మీదుగా కురుమాల చేరుకొని తొలిరోజు 20.1 కిలోమీటర్లు పాదయాత్ర చేసి రాత్రికి కురుమాలతో బస చేస్తారు.

- రెండోరోజు 20వ తేదీ (శనివారం) ఓడీ చెరువు మండలంలోకి పాదయాత్ర ప్రవేశిస్తుంది. అనంతరం ఓడీ చెరువు, అమడగూరు, పుట్టపర్తి అర్బన్, కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి రూరల్ మండలాల్లో ఈనెల 27వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు పాదయాత్ర కొనసాగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

సాయి కీర్తనం.. సంక్రాంతి ఉత్సవం



'శివామృతం' నాటికలోని ఓ ఘట్టం



బహుమతులు ప్రదానం చేస్తున్న రత్నాకర్

- ప్రశాంతి నిలయంలో ఘనంగా వేడుకలు
- క్రీడా సాంస్కృతిక సమ్మేళనం విజేతలకు బహుమతులు

ప్రశాంతి నిలయం: సంక్రాంతి పర్వదిన వేడుకలు సోమవారం ప్రశాంతి నిలయంగా ఘనంగా జరిగాయి. వేడుకలను పురస్కరించుకుని సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం ఉదయం వేదపఠనంతో కార్యక్రమాలు ప్రారంభం కాగా, విద్యార్థులు సత్యసాయి పల్లకీని ఊరేగింపుగా తీసుకువచ్చారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం బ్రాస్ బ్యాండ్ వాయిద్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సత్యసాయి విద్యాసంస్థల క్రీడా, సాంస్కృతిక సమ్మేళనంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, విద్యాసంస్థల సిబ్బందికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి, సత్యసాయి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రాఘవేంద్ర ప్రసాద్ తదితరులు బహుమతులు అందజేశారు. సాయంత్రం 'శివామృతం' పేరుతో ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు నాటిక ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.



సంక్రాంతి ఉత్సవాల్లో బ్రాస్ బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థులు

నమో నారసింహా

- వైభవంగా నృసింహుడి పార్వేట ఉత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



అశ్వవాహనంపై ఊరేగుతున్న ఖాద్రీశుడు



పార్వేట ఉత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కదిరి టౌన్: వేలాది భక్తుల నారసింహుని నామ స్మరణతో కదిరి కొండ ప్రతిధ్వనించింది. అశ్వవాహనంపై కొలువుదీరిన ఖాద్రీశుని దర్శనంతో భక్తజనం మైమరచిపోయింది. సంక్రాంతి తర్వాత కనుమ రోజు ఆనవాయితీగా నిర్వహించే నృసింహుని పార్వేట ఉత్సవం మంగళవారం వైభవంగా సాగింది.

కమనీయంగా పాలపొంగుల ఉత్సవం
ఉదయం అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభుడిని విశేషంగా అలంకరించారు. అనంతరం పల్లకీపై కొలువుదీర్చి భక్తుల గోవింద నామస్మరణ మధ్య తిరువీధుల నుంచి గిరిప్రదక్షిణగా కదిరి కొండకు తీసుకువచ్చారు. అక్కడ కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి కాటమరాయునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారు కుమ్మరవాండ్లపల్లి సమీపాన పాలపొంగుల ఉట్టిలో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. కొలేపల్లికి చెందిన యాదవ కులస్తులు కొత్తకుండలో తెచ్చిన పాలతో పాలపొంగలి చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.

కదిరికొండ..జనసంద్రం
పాలపొంగుల ఉత్సవం తర్వాత ఖాద్రీశున్ని పల్లకీలో కొలువుదీర్చి పార్వేట మండపం వద్దకు తీసుకురాగా, వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రెండు కుందేళ్లను జనం మధ్యకు వదలగా యువకులు ఉత్సాహంగా వాటిని వెంబడించి వాటి శరీర భాగాలను లాక్కున్నారు. పార్వేట ముగియగానే స్వామివారిని రాయచోటి రోడ్డులోని మశానంపేటలోని శమీ మండపానికి తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం శ్రీవారు అశ్వవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమం ముగియగానే చోర సంవాదం తర్వాత స్వామివారు ఆలయ ప్రవేశం చేశారు. భక్తులకు వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.



సామూహిక పాలపొంగు ఉత్సవం

క్లుప్తంగా

అయోధ్య వెళ్లేవారికి రైలు సౌకర్యం

హిందూపురం అర్బన్: అయోధ్య రామయ్యను దర్శించుకునే వారి కోసం ఇండియన్ రైల్వే రైలును అందుబాటులోకి తెచ్చింది. యశ్వంతపూర్-గోరఖ్‌పూర్ మధ్య నడిచే ఈ రైలు (15024) ప్రతి గురువారం బెంగళూరులోని యశ్వంతపూర్ స్టేషన్ నుంచి రాత్రి 11.40 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 7.35 గంటలకు గోరఖ్‌పూర్‌కు చేరుకుంటుంది. ప్రతి గురువారం రాత్రి 11.40 లకు యశ్వంతపూర్ స్టేషన్‌లో బయలు దేరి శుక్రవారం తెల్లవారుజామున 2.35 గంటలకు ధర్మవరం, 3.08 గంటలకు అనంతపురం, శనివారం ఉదయం 6.18 గంటలకు కర్నూలు, 8.38 గంటలకు మహబూబ్‌నగర్, 10.40 గంటలకు కాచీగూడ చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలుదేరి కాజీపేట, నాగపూర్, కాన్పూర్, లక్నో మీదుగా శనివారం సాయంత్రం 4.24 గంటలకు అయోధ్య ధాం స్టేషన్‌కు చేరుకుంటుందని సౌత్ వెస్టన్ రైల్వే అధికారులు తెలిపారు. అక్కడి నుంచి శనివారం రాత్రి 8 గంటలకు గోరఖ్‌పూర్ వెళ్లనుంది. ఇదే రైలు (15023) ప్రతి మంగళవారం ఉదయం 8.50 గంటలకు గోరఖ్‌పూర్ నుంచి బయలుదేరి ఖాజీపేట మీదుగా బుధవారం రాత్రి 8 గంటలకు కాచిగూడ, గురువారం తెల్లవారుజాము 4.13 గంటలకు అనంతపురం, 5.15 గంటలకు ధర్మవరం చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలుదేరి ఉదయం 10.30 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందని వివరించారు.

కొడుకు చేతిలో గాయపడిన తల్లి మృతి

తాడిమర్రి: కొడుకు చేతిలో గాయపడిన తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.... ఈ నెల 14న ఆదివారం రాత్రి 9.30 గంటలకు తాడిమర్రి మండలం మర్రిమాకులపల్లికి చెందిన సాకే ఈశ్వరయ్య కొడవలితో కన్నతల్లి బాలవీరమ్మ (55)పై దాడి చేసిన విషయం తెలిసిందే. మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని ఈ ఘాతాకానికి ఈశ్వరయ్య తెగించాడు. తీవ్రంగా గాయపడిన బాలవీరమ్మను కుటుంబసభ్యులు అదే రోజు బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం మధ్యాహ్నం ఆమె మృతి చెందింది. ఈశ్వరయ్యపై హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గాండ్లపెంట: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గాండ్లపెంట మండలం గొడ్డువెలగల పంచాయతీ నరసప్పగారిపల్లికి చెందిన మంచాల శ్రీనివాసులు (37) తనకున్న 2.45 ఎకరాల భూమిలో బోరు బావి కింద వేరుశనగ పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఐదు గంటలకు పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన మోటార్‌ను ఆన్ చేసేందుకు విద్యుత్ వైరును తగిలిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్య నందిని, ఇద్దరు కుమారులు ఉన్నారు.

శరవేగంగా 'ఎన్‌హెచ్ 342' పనులు

- రూ.1745 కోట్ల వ్యయంతో జాతీయ రహదారి పనులు
- నిర్మాణంలో 80 బ్రిడ్జిల ఏర్పాటు



వెంకటగారిపల్లి వద్ద నిర్మాణం పూర్తయిన కల్వర్ట్



బీడుపల్లి వద్ద కంకరను సిద్ధం చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో 342 జాతీయ రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే కేవలం గంట వ్యవధిలోనే ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతున్న పుట్టపర్తికి బెంగళూరులోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పర్యాటకులు, దేశవిదేశీ భక్తులు సులువుగా చేరుకోవచ్చు. ప్రస్తుతం పలు మండలాలు, గ్రామాల మీదుగా రెండు గంటలకు పైగా ప్రయాణ సమయం పడుతోంది.

మొదటి ప్యాకేజీ పనులు పూర్తి

'జాతీయ రహదారి 342' మొదటి ప్యాకేజీ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ముదిగుబ్బ ఉంచి బుక్కపట్నం వరకూ పనులు పూర్తి కాగా, రెండో ప్యాకేజీ కింద జానకంపల్లి నుంచి కోడూరు వరకూ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులకు దాదాపు రూ.1,745 కోట్లను వెచ్చిస్తున్నారు. ఇందులో 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.850 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఇందులో తొలి ప్యాకేజీ కింద 34 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.310 కోట్లను, రెండో ప్యాకేజీ కింద 46 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.540 కోట్లను వెచ్చిస్తున్నారు. రోడ్డు నిర్మాణంతో పాటు సత్యసాయి వాటర్ పైప్‌లైన్, విద్యుత్ సౌకర్యం, బ్రిడ్జిల నిర్మాణం, మధ్యలో వచ్చే కొండలను చీల్చుకుంటూ రోడ్డు వేస్తున్నారు.

ఏడాదిలోపు పూర్తి

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇప్పటికే 175 హెక్టార్ల భూమిని అధికారులు సేకరించారు. మరి కొంత సేకరించాల్సి ఉంది. జాతీయ రహదారి మార్గంలో మొత్తం 80 బ్రిడ్జీలను నిర్మిస్తున్నారు. ఇందులో పుట్టపర్తి సమీపంలోని చిత్రావతి నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి అతి పెద్దది కావడం గమనార్హం. సాహెబ్ చెరువు సమీపంలో ఒకటి, గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి వద్ద ఒక అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇవిగాక 42 బాక్స్ కల్వర్టులు, 30 పైప్ కల్వర్ట్ బ్రిడ్జిలు, ఐదు మైనర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. జంక్షన్లు, గంటల మారెమ్మ ఆలయం సమీపంలో 51వ మైలు రాయి వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేయనున్నారు. వీటి కోసం అవసరమైతే మరి కొంత భూమిని సేకరించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, మొత్తం నిర్మాణ పనులకు ప్రభుత్వం రెండేళ్ల వ్యవధి నిర్దేశించినా.. ఏడాదిలోపు పూర్తి చేసేలా కార్యాచరణను వేగవంతం చేసినట్లు డీఈ జగదీష్ గుప్త తెలిపారు.

ఊరంతా వైఎస్సార్‌సీపీనే



వైఎస్సార్‌సీపీలోకి చేరిన తర్వాత మాట్లాడుతున్న నాయకులు

తలుపుల: మండల కేంద్రంలోని ఉబ్బరవాండ్లపల్లికి చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి సమక్షంలో టీడీపీకి చెందిన పది కుటుంబాలు, టీడీపీలో చేరిన మరో పది కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. 50 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఉబ్బరవాండ్లపల్లిలో చిన్నపాటి గొడవలు సృష్టించి గ్రామస్తుల మధ్య విభేదాలు సృష్టించేందుకు టీడీపీ నేతలు సాగించిన కుట్రలను తిప్పి కొడుతూ మంగళవారం ఊరు ఊరంతా ఏకతాటిపైకి వచ్చి వైఎస్సార్‌సీపీలోకి మారారు. ఇకపై తాము పార్టీలు మారేదేలేదని, గతంలో కంటే భిన్నంగా పార్టీ అభ్యున్నతికి, గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని ప్రకటించారు. పార్టీలో చేరిన టీడీపీ నాయకుడు వేణుగోపాలరెడ్డి తదితరులు మాట్లాడుతూ... తమ గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చొరవకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీ నాయక్, జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ, శివారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఉరవకొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన మిషన్ రామన్న(48) అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన సమీప బంధువును పలకరించేందుకు మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఉరవకొండ మండలం కోనాపురం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామన్న అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా ఉడాయించాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ పాల్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బెదిరించి వలంటీర్‌కు టీడీపీ కండువా!

చిలమత్తూరు: రాబోవు ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకున్న టీడీపీ నాయకులు కుతంత్రాలకు తెరలేపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎదుటి వ్యక్తి బలహీనతలను సొమ్ము చేసుకుని బెదిరించి బలవంతగా టీడీపీ కండువాలు కప్పుతున్నారు. ఈ కుట్ర బట్టబయలు కావడంతో టీడీపీ నేతలు స్వీయ రక్షణలో పడ్డారు. వివరాలు... చిలమత్తూరు మండలం పలగలపల్లికి చెందిన వలంటీర్ రాజశేఖర్‌కు రెండు రోజుల క్రితం టీడీపీ నాయకులు బలవంతంగా మద్యం తాగించి టీడీపీ కండువా కప్పారు. టీడీపీలో చేరుతున్నట్లుగా సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తూ పలగలపల్లి సర్పంచ్ శంకర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయించారు. అనంతరం వీడియోను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసి దుష్ప్రచారానికి తెరలేపారు. దీనికి ప్రతిగా మంగళవారం వలంటీర్ రాజశేఖర్ మరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. టీడీపీ నేతలు సురేంద్ర, నరసింహయ్య, కోడూరు బేకరీ గంగాధర్, టీడీపీ మాజీ కన్వీనర్ రంగారెడ్డి తనకు బలవంతంగా మద్యం తాపి తప్పుడు వ్యాఖ్యలు చేసేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను మాట్లాడిన మాటలు, టీడీపీ కండువా కప్పుకోవడం వంటివి తన కేమాత్రమూ తెలియదని ఒప్పుకున్నాడు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనతో హిందూపురం నియోజకవర్గంలో బాలకృష్ణ ఓటమి తప్పదని భావించి ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు ఆ పార్టీ నేతలు పాల్పడుతున్నారని ఈ సందర్భంగా సర్పంచ్ శంకరరెడ్డి మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసిన వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

సాక్షి, పుట్టపర్తి: గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నాసిన్ అకాడమీ ప్రారంభోత్సవానికి మంగళవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. కడప నుంచి హెలికాప్టర్‌లో నేరుగా పాలసముద్రం చేరుకున్నారు. అక్కడ హెలిప్యాడ్ వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు శంకర్‌నారాయణ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, సిద్ధారెడ్డి, తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ మాధవ్ రెడ్డి తదితరులు సీఎంకు స్వాగతం పలికారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు, పెనుకొండ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, శంకరనారాయణ



మడకశిర, పుట్టపర్తి, కదిరి ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి



ఎమ్మెల్సీ మంగమ్మ



ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



కలెక్టర్ అరుణ్‌బాబు



ఎస్పీ మాధవ్‌రెడ్డి



జేసీ అభిషేక్ కుమార్

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

పుట్టపర్తి అర్బన్: విజయవాడ వేదికగా 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలనుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం అమోఘమైన చర్య అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తికి విచ్చేసిన ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాంఘిక సంక్షేమశాఖ డీడీ శివరంగప్రసాద్, ఏఎస్‌డబ్ల్యూ రెడ్డి బాలాజీతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 19న విజయవాడలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించనున్నారని తెలిపారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అలాగే అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలియజేసేలా మ్యూజియం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సుమారు రూ.400కోట్ల వ్యయంతో 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహాన్ని స్వేచ్ఛ, సమానత్వానికి ప్రతిరూపం (ఈక్వాలిటీ ఆఫ్ లిబర్టీ)గా చెప్పుకోవచ్చన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అంబేడ్కర్ స్మృతి వనంతో పాటు జీవిత చరిత్ర తెలిపేలా మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కైలైటింగ్, ఫౌంటెన్లు, లైబ్రరీ తదితర సౌకర్యాలను కల్పించడం వెనుక సీఎం వైఎస్ జగన్ కృషి ఎంతో ఉందన్నారు. దాదాపు 3 వేల మంది కూర్చునే ఓపెన్ థియేటర్, 10 వేల పుస్తకాలతో లైబ్రరీ, భావి తరాలకు తెలియజేసేలా గొప్ప కళాఖండాన్ని తీర్చి దిద్దారన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు.

డీఏఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

అనంతపురం ఎడ్యుకేషన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీఏఎఫ్) ఉభయ జిల్లాల నూతన కార్యవర్గాలను మంగళవారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షురాలిగా మంజుల, ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జార్జ్, డానియల్ విజయ్, దౌలత్ ఖాన్‌తో పాటు మరో నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా గౌసిలాజమ్, ప్రధాన కార్యదర్శిగా మారుతీప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా షర్ఫుద్దీన్, శ్రీనాథ్‌తో పాటు నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు కార్యదర్శులను ఎన్నుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

తొలి విడత తహసీల్దార్ల బదిలీ

అనంతపురం అర్బన్: ఎన్నికల నేపథ్యంలో తొలివిడత తహసీల్దార్ల బదిలీ ప్రారంభమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జోన్-4 పరిధిలోని జిల్లా కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల్లో పనిచేసే తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను సీసీఎల్‌ఏ ఏఎండీ ఇంతియాజ్ మంగళవారం జారీ చేశారు.

బదిలీ అయిన జిల్లాకు చెందిన తహసీల్దార్లు

తహసీల్దార్	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వి.శ్రీనివాసులు	కర్నూలు	రామగిరి
ఎ.వెంకటేశ్వర్లు	కర్నూలు	మడకశిర
ఇ.ప్రతాపరెడ్డి	వైఎస్సార్ కడప	గుడిబండ
పి.భారతి	వైఎస్సార్ కడప	పుట్టపర్తి
నాగభూషణం	అన్నమయ్య	ధర్మవరం
ఎ.శ్రీనివాసులు	శ్రీసత్యసాయి	పుల్లంపేట (కోడూరు)
టి.ఆనంద్‌కుమార్	శ్రీసత్యసాయి	రామాపురం (రాయచోటి)
కతీన్‌జన్ కుఫరా	పుట్టపర్తి	వాయల్పాడు (పీలేరు)

రాష్ట్ర స్థాయి పోటీలకు కబడ్డీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన బాలబాలికల జట్లు

గుంతకల్లు: ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకూ నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే జిల్లా బాలబాలికల జట్టు ఎంపిక మంగళవారం గుంతకల్లులో చేపట్టారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో ఈ నెల 15న చేపట్టిన ఈ ప్రక్రియకు ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలుర విభాగంలో గుంతకల్లుకు చెందిన కుసులన్న, జమన్న, బి.సునీల్, యు.వంశీ, పులగుట్టపల్లికి చెందిన పి.సోము, అనంతపురానికి చెందిన నాగేశ్వరరెడ్డి, వెంకటసాయి, తిమ్మాపురం నుంచి సునీల్, తాడిపత్రి నుంచి ఎం.అనిల్, కొనకొండ్ల నుంచి గోపీకృష్ణ, పామిడి నివాసి కె.అనిల్, రాయలచెరువుకు చెందిన ఎం.నవీన్, స్టాండ్‌బై కింద పి.ఆనంద్, సి.వంశీ, జి.నాగార్జున, ఎం.వీరన్న ఎంపికయ్యారు. బాలికల జట్టులో గుంతకల్లుకు చెందిన జ్యోతి, రేవతి, షకీల, నందిని (బత్తలపల్లి) ఆయేషా, మేజిబా, జయశ్రీ (అనంతపురం), ప్రియాంక, సాగరిక (ధర్మవరం), నవ్య (తాడిపత్రి), సి.ప్రణవి, ప్రమీల (నెలగొండ), స్టాండ్ బై కింద సి.నందని (అనంతపురం), అర్చన (తాడిపత్రి) చోటు దక్కించుకున్నారు. కార్యక్రమాన్ని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ గుంతకల్లు మండల కన్వీనర్ బి.మోహనరావు, పీడీ సత్యనారాయణ, ఓబులేసు తదితరులు పర్యవేక్షించారు.

మాకూ చదువుకోవాలని ఉంది



ముఖానికి రంగులు అద్దుకుంటున్న చిన్నారులు

పెనుకొండ రూరల్: చదువుకోవాల్సిన వయసులో చేతులు చాచి భిక్షమెత్తుకుంటున్నారు. చిరు ప్రాయంలోనే కుటుంబ పోషణ భారాన్ని పంచుకుని ముఖానికి రంగులు అద్దుకున్నారు. చిన్నారుల కష్టాన్ని గమనించి 'సాక్షి' పలకరిస్తే ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. అనంతపురంలోని బిందెల కాలనీకి చెందిన అరుణ్ పదో తరగతి వరకూ చదువుకున్నాడు. ఈ క్రమంలో కుటుంబపోషణ భారంగా మారడంతో తన చెల్లెలు గౌతమితో కలసి పెనుకొండ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఆంజనేయస్వామి వేషధారణతో భిక్షమెత్తుకోవడం మొదలు పెట్టాడు. తన తండ్రి సైకిల్‌పై దుస్తుల వ్యాపారం చేస్తుంటాడని, కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున చదువు కొనసాగించలేక దేవుడి వేషం కట్టి భిక్షమెత్తుకుంటున్నట్లు అరుణ్ వివరించాడు. అందరిలా చదువుకోవాలని తమకూ ఉందని, అయితే పూటగడవని స్థితిలో ఇలా పగటి వేషం కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. దాతలు సహకరిస్తే చదువును కొనసాగించి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఉందని పేర్కొన్నాడు.



రహదారుల వెంబడి యాచనకు సిద్ధమైన దృశ్యం